# 8. ఎల్లల నడుమ

అసంతృప్తి. ఏ పని చేస్తున్నా... చేయకపోయినా అసంతృప్తి. ఇంతకన్నా చనిపోవడం నయం అనే భావం.


ఎంతకన్నా!... ఈ బ్రతుకుకన్నానా! ఏమైంది ఈ బ్రతుకుకి? ఏం సమస్యలున్నాయి? లేకేం! వున్నాయి. ఏకరువు పెట్టాలంటే చాలా వున్నాయి. కానీ అవేవీ చావు కన్నా పెద్ద సమస్యలు కావు. సాల్వ్ చేసుకోలేనివీ కావు. కనీసం సాల్వ్ చేసుకోలేనేమోనని అనుమానం కలిగించేవీ కావు.

మరెందుకీ బాధ! మంచి వుద్యోగం.... అందమైనదీ, అనుకూలమైనదీ అయిన భార్య... చూసి రమ్మంటే కాల్చి రాగల చాకుల్లాంటి పిల్లలు... కాగడా పెట్టి వెదికినా దరిదాపుల్లో అసంతృప్తికి కారణాలు దొరకవు.

మరెక్కడి నుంచి వస్తోంది ఈ అసంతృప్తి!...

కొంచెం సీరియస్‌గానే ఆలోచిస్తున్నాను ఈ విషయం గురించి కొన్ని రోజులుగా.

ఏ సమస్యనైనా సిస్టమేటిక్‌గా అనలైజ్ చేయడంలోనూ... ఒకసారి సమస్యకి కారణం తెలుసుకున్నాక... ఆ తర్వాత మంచి ప్లానింగ్ తోనూ, పద్ధతితోనూ పనిచేసి ఆ కారణాన్ని రూపుమాపడంలోనూ నన్ను మించిన వాళ్ళు లేరని నాకు గొప్ప నమ్మకం.




అయితే ఈ సమస్యకి కారణం మాత్రం అంత సులభంగా దొరకడం లేదు. దీనిమీద దృష్టి పెట్టి ఆలోచించడం మొదలు పెట్టాక నాలాంటి వాళ్ళందరినీ నా కళ్ళు చురుగ్గా గుర్తించనారంభించాయి. వాళ్ళు ఏకరువు పెట్టే ప్రతి కారణాన్నీ.... చెవులు శ్రద్ధగా ఆలకించనారంభించాయి. ఇదా! ఇదేనా కారణం! అని బుర్ర ప్రతి విషయాన్నీ తర్కించడం మొదలు పెట్టింది. కానీ ప్రతి కారణమూ

కాసేపు తర్కించుకున్నాక వీగిపోతోంది. మూలకారణం యిది కాదు... యింకేదో వుందనిపిస్తోంది.

ఆలోచిస్తూనే టైమ్ చూసుకున్నాను. రెండుంబావు అయింది. రెండున్నరకి మీటింగ్ వుంది. కాన్ఫరెన్స్ హాల్ వైపు అడుగులు వేశాను. మీటింగ్‌కి యింకా టైమ్ వుండడంతో అందరూ బయట నిలుచుని కాఫీ త్రాగుతున్నారు.

నేను కూడా లాప్‌టాప్ కాన్ఫరెన్స్ రూంలో పెట్టి యివతలికి వచ్చాను. టీ కలుపుకుంటుంటే వాళ్ళ మాటలు చెవిన పడ్డాయి.

చిత్రం! వాళ్ళూ యిదే విషయం చర్చిస్తున్నారు! పెరిగిపోతున్న అసంతృప్తి గురించి!

దగ్గరగా వెళ్ళి నిలుచున్నాను. గ్లోబలైజేషన్ మీదుగా చర్చ మొదలైందని అర్థమయింది.

ప్రకాశ్ అన్నాడు - "గ్లోబలైజేషన్ మూలంగా అసమానతలు పెరిగిపోయాయి. అందుకే అసంతృప్తులు పెరిగాయి."

ఏకీభవిస్తున్నట్లుగా తలవూపాడు జాకబ్ - ".... కంప్యూటర్ రాగానే ఉద్యోగం పోయిన వాళ్ళూ... క్రొత్త టెక్నాలజీ వాడుకోలేక వెనకబడ్డ వాళ్ళూ... వీళ్ళందరూ అసంతృప్తికి లోనవుతున్నారు" అన్నాడు.

"మరి అవన్నీ వాడుకుని పైకి వచ్చిన వాళ్ళకీ అసంతృప్తి వుంటోందిగా!" అన్నాడు ప్రదీప్.

సరిగ్గా నేనడగాలనుకున్న ప్రశ్న. అవును. ఉద్యోగం పోవడం... చేతి వృత్తులు కోల్పోవడం లాంటి కేటగిరిలోకి రాని నాలాంటి వాడు... ఆ టెక్నాలజీని, ప్రపంచంలో వచ్చిన మార్పులనీ పూర్తిగా వుపయోగించుకుని సుఖపడుతున్న నాలాంటి వాడికి అసంతృప్తి ఎందుకు! జాకబ్ చెప్పినట్లు యిబ్బందుల వల్లే అసంతృప్తి కలుగుతుంటే... నాలాంటి వాడికి ఏ అసంతృప్తీ వుండకూడదు కదా!

ప్రదీప్ ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

ఒక నిమిషం తర్వాత నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, "నోస్టాల్జియా!" అన్నాడు మూర్తి.

మూర్తి పుస్తకాలు బాగా చదువుతాడు. మాలాగా టెక్నికల్ మాగజైన్సే కాదు - సాహిత్యం కూడా చదువుతాడు.

అందుకే అందరం వివరణ ఆశిస్తూ అతనివైపు ఆసక్తిగా చూశాం.

"మీరు కథలు చదివితే తెలుస్తుంది. బాగా చదువుకుని పెద్ద సిటీలోనో, మరో దేశంలోనో వుద్యోగం చేసుకుంటున్నవాడు - కొన్నేళ్ళ తర్వాత తను పుట్టి పెరిగిన పల్లెటూరికి వస్తాడు. అక్కడంతా మారిపోయి వుంటుంది. ఒకప్పటి సౌందర్యం వుండదు. చాలా అసంతృప్తికి లోనవుతాడు".

"మరి పల్లెటూరికి వెళ్ళకపోతే!" అన్నాను నేను మూర్తి మాటలకి అడ్డం పడుతూ.

ఉన్నట్లుండి నేనలా వాళ్ళ మాటల్లో దూరి ఆ ప్రశ్న వేసేసరికి అందరూ నావైపు చూసి నవ్వారు. నేవేసింది అంత తెలివైన ప్రశ్న కాదన్న భావం కనబడింది ఆ నవ్వుల్లో.

"పల్లెటూరికి వెళ్ళినా వెళ్ళకపోయినా అప్పటి ఆనందాలు కొన్ని యిపుడు కోల్పోయామన్న భావన వుంటుంది కదా! అమ్మ చేసిన అరిసెలు... నాన్న తెచ్చిన చెరుకు గడలు... అక్క పెట్టిన సంక్రాంతి ముగ్గులు.. వగైరా వగైరా..." అన్నాడు మూర్తి సహనంగా వివరిస్తూ.

మీటింగ్ టైమ్ అవడంతో అందరూ అక్కడితో చర్చ ఆపి లోపలికి నడిచారు.

మాటలు ఆగినా నా బుర్రలో ఆలోచనలు ఆగలేదు - 'నిజమేనా! మూర్తి చెప్పినదే సరైన కారణమా!'

నేను ఆలోచనలలో వుండగానే మీటింగ్ అయిపోయింది. ఆఫీస్ మూసేసే టైమూ అయింది.

పొద్దున సుధాకర్ ఫోన్ చేశాడు 'బిజీగా వున్నావా' అంటూ.

వసంత వూర్లో లేదని తొమ్మిది దాకా ఆఫీసులో వుంటున్నాను కానీ నిజానికి అంత పనేమీ లేదిపుడు. అదేమాట చెప్పాను.

"అయితే సాయంత్రం యింటికి రారాదూ!" అన్నాడు.

"సరే!" అన్నాను. ఆలోచించకుండా. ఏ అకేషనూ లేకుండా, 'ఓసారి యింటికి రారాదూ!' అనే స్నేహితుడు వాడొక్కడే.

నా కారు సుధ యింటి బయట ఆగేసరికి సుధ కూడా కారు దిగుతూ కనిపించాడు.

నన్ను చూసి నవ్వి, "సరిగ్గా టైమ్‌కి వచ్చానన్నమాట" అన్నాడు యింటి తాళం తీస్తూ.

"రమ ఎన్నింటికి వస్తుంది?" అన్నాను నేను లోపలికి నడుస్తూ.

"వస్తుంది. సిక్స్ థర్టీ, సెవెన్ కల్లా."

లోపలికి వెళ్ళి స్నానం చేసి చక్కటి పైజామా లాల్చీలో ఫ్రెష్‌గా వచ్చిన వాడ్ని చు "అమ్మయ్య! యిపుడు హాయిగా వున్నావురా! ఆ యూనిఫాంలో చూడలేక పోయా అన్నాను.

వాడు నవ్వాడు. వాళ్ళ ఆఫీసులో అందరికీ యూనిఫాం వుంది.

"రోజూ అలా ఒకటే వేసుకోవాలంటే బోర్‌గా వుండదురా!" అన్నాను.

"స్కూల్ పిల్లలు వేసుకోవట్లా!" అన్నాడు వాడు.

"పిల్లలు సరే. పెద్దయ్యాక మన టేస్ట్‌లు మనకుంటాయి కదా! నువు ఎంత మ మంచి షర్ట్స్ వేసేవాడివి! ఈ కంపెనీలో చేరాక ఎపుడూ ఒకటే షర్ట్‌లో చూసి చ విసుగొస్తోంది" అన్నాను.

"పిల్లలకి మనకన్నా ఎక్కువ టేస్ట్స్ వుంటాయిరా బాబూ!" అన్నాడు వా నవ్వుతూ.

"నిజమే" వెంటనే ఒప్పుకున్నాను నేను, మా అబ్బాయి గుర్తొచ్చి.

"అందుకే వాళ్ళకి యూనిఫామ్ బెటర్. లేకపోతే రోజూ డ్రెస్ వేసుకోవడా గంట పడుతుంది" అన్నాను, ఏదన్నా ఫంక్షన్‌కి వెళ్ళాలంటే మావాడు డ్రెస్ సెలక్ష తీసుకునే టైమ్ గుర్తు చేసుకుంటూ.

"ఆ అడ్వాంటేజ్ మనకీ వుంది కదరా! ఏ డ్రెస్ వేసుకోవాలా అని ఆలోచించే లేకుండా రోజూ యూనిఫామ్ తగిలించుకుని వెళ్ళిపోవచ్చు" అన్నాడు సుధ.

"అలాగే అనుకుంటారా మీరందరూ!" అన్నాను నేను సుధవైపు పరీక్షగా చూస

"అందరూ అన్నిసార్లూ అలా అనుకోరులే" అన్నాడు సుధ. "బోర్‌గా వుం విసుగ్గా వుంది అనుకుంటారు. రోజుకోరకం వేసుకునే అవకాశం లేదని బాధపడ్తా కానీ వెతుక్కోకుండా గబుక్కున వేసుకునే సౌకర్యం గురించి మాత్రం అంద ఒప్పుకుంటారు."

సుధ మాటలు పూర్తవుతూండగానే ఫోన్ మోగింది.

మాట్లాడి, "వంశీ గూడా వస్తున్నాడు. అయిదు నిమిషాల్లో యిక్కడ వుంటానన్నా అంటూ వంటగదిలోకి వెళ్ళాడు.

మేము ముగ్గురం హైస్కూల్ రోజులనుంచీ స్నేహితులం.

మేము యిలా ఎపుడు కలుసుకున్నా ఆ సాయంత్రం చాలా హాయిగా, సరదాగా గడుస్తుంది. వంశీ సరదా సంభాషణలతో మనసూ, సుధ పంచే కొత్త ఆలోచనలతో మెదడూ ఉత్సాహం పుంజుకుంటాయి.

వంశీ రాగానే సుధ ఫలహారం ప్లేట్లు అందించాడు.

పులిహోర, తొక్కుడు లడ్డూ, కాజా వున్న ప్లేట్ అందుకుంటూ "ఏంట్రా! యివన్నీ నువ్వే చేశావా!" అన్నాడు వంశీ.

"నీ మొహం. పులిహోర రమ చేసింది పొద్దున. స్వీట్లు స్వగృహాలో తెచ్చుంటుంది" అన్నాడు సుధ.

మేమిద్దరం పులిహోర లాగిస్తుంటే సుధ కాఫీ కప్పులు తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు. పెళ్ళాం యింట్లో లేకపోయినా వాడంత బాగా అన్నీ అరేంజ్ చేస్తున్నందుకు మేమిద్దరం మెచ్చుకుంటుంటే....

"రమ ఎప్పుడూ డబ్బాల్లో రెడీగా వుంచుతుందిరా" అన్నాడు సుధ.

"ఉంచడం సరే. అది నీకు తెలియడం ఆశ్చర్యంగా వుంది. నాకు మా ఆవిడ లేకపోతే ఏదెక్కడుందో అర్థం కాదు. ఆకలితో కూర్చుంటే తను వచ్చాక 'ఫ్రిజ్‌లో ఫ్రూట్స్ వున్నాయి కదా! స్టవ్ మీద ఉప్మా వుంది కదా!' అని లిస్టు చదువుతుంది. ఏమీ చూసుకోకుండా తినకుండా కూర్చున్నందుకు చీవాట్లేస్తుంది."

వంశీ యాక్షన్‌కి మేము నవ్వాం.

"అవును మరి! ప్రపంచంలో నాలుగు మూలలా టీమ్ మెంబర్స్‌ని పెట్టుకుని పనిచేసే ప్రాజెక్ట్ మానేజర్‌వి. ఆ మాత్రం తెలీక పోతే ఎలా!" – సుధ ఆట పట్టించాడు.

"అక్కడ తప్పదులే. ముగ్గురు టీమ్ మెంబర్స్‌ని ఫ్రాంక్‌ఫర్ట్‌లో, ముగ్గుర్ని మలేషియాలో, ఒకడ్ని అమెరికాలో పెట్టుకుని ప్రాజెక్ట్ నడపాలి కదా– అక్కడ అన్నీ సిస్టమేటిక్‌గా చేయకపోతే కుదరదు" అన్నాడు వంశీ.

"రమ అదేపని యింట్లో చేస్తుంది. ప్రతి వస్తువుకీ ఓ ప్లేస్ ఖచ్చితంగా నిర్ణయించేస్తుంది. అక్కడి నుంచి అరంగుళం కూడా అది ప్రక్కకి జరగదు. ఆ యిన్ఫర్మేషన్‌ని యిక మర్చిపోవడానికి వీల్లేనంత బాగా అందరి బుర్రల్లో కూరేస్తుంది. అందుకే నేనూ, పిల్లలూ... ఏదీ ఎపుడూ వెతుక్కోనక్కరలేదు" – సుధ వివరించాడు.

"నిజమే. అన్నీ ఎపుడూ ఒకే పద్ధతిలో వుండడం, ఒకే రకంగా వుండడం బాగానే వుంటుంది – అనుకూలంగా సౌకర్యంగా" – ఒప్పుకున్నాడు వంశీ.

"తమాషా ఏమిటంటే ఆ సౌకర్యమూ ఒక్కోసారి అసంతృప్తికి దారి తీస్తుంది" అన్నాడు సుధ.

నేను ఉలిక్కిపడ్డాను. వెతుకుతున్నదేదో దొరికినట్లు అనిపించిందో క్షణం. మళ్ళీ అంతలోనే అంతా అగమ్యంగా అయిపోయింది.

"ఇందాక సరిగ్గా అదే విషయం మాట్లాడుకున్నాం మేమిద్దరం" - సుధ యూనిఫాం గురించి మేం చేసిన చర్చ వివరిస్తుంటే నేను లేచి నిలుచున్నాను.

ఆ యింట్లో బాత్‌రూం ఎక్కడ వుందో ఒక్క క్షణం గుర్తు రాలేదు. ఆలోచిస్తూ నిల్చుంటే, "ఏం(ట్రా?" అన్నాడు సుధ.

వాడు అడుగుతూండగానే గుర్తొచ్చింది. హాలుకి ఎడమ వైపున వంటగది ప్రక్కగా వున్న నడవాలో నుంచి వెనక్కి వెళ్తే అక్కడ వుంటుంది బాత్‌రూం.

ఎన్నిసార్లొచ్చినా తడుముకుంటూనే వుంటాను నేనీ యింట్లో. కారణం యిది మా యిల్లులా... వంశీ వాళ్ళ యిల్లులా యిప్పటి పద్ధతిలో కట్టబడిన ఇల్లు కాదు.

బెడ్‌రూమ్‌లూ, వంటగదీ, బాత్‌రూమ్ అన్నీ హాల్లో నిలుచుంటే కనిపించేలా సౌకర్యంగా కట్టలేదు ఈ యింటిని. సిటీకి సెంటర్లో వుందని ఎప్పటి నుంచో ఈ యింట్లో అద్దెకి వుంటున్నాడు సుధ.

"ఏం లేదు. బాత్‌రూమ్ కోసం" అంటూ నడవాలోకి నడిచాను నేను.

నా ప్రాబ్లమ్ అర్థమయినట్లు, "వీడి యిల్లు ఒక మయసభరా బాబూ!" అన్నాడు వంశీ.

ఆ కారిడార్‌లో అలా నడిచి వెళ్తుంటే చిన్నప్పుడు మేము తరచుగా వెళ్తూండే మా చిన్నమామయ్య వాళ్ళిల్లు గుర్తొచ్చింది. ఆ యిల్లు మెయిన్ రోడ్ మీద వుండేది. మెయిన్ రోడ్ మీదకి షాపింగ్ కాంప్లెక్స్. వెనకవైపు యిల్లు. మెయిన్ రోడ్‌కి ప్రక్కన చిన్న సందులోకి తలుపు. ఆ తలుపు తీసుకుని లోపలకి వెళ్తే ఓ నడవా. దానికి ఒక వైపున రెండు చిన్న రూమ్‌లూ, బాత్‌రూమ్. మరో వైపు ఓ పెద్ద రూమ్. చిన్న రూమ్స్‌లో ఒకటి వంటగది. మరొకటి బెడ్ రూమ్. పెద్ద రూమ్ హాలు. దేనికదే విడివిడిగా వుండేవి. అన్నిటికీ సెపరేట్‌గా తాళాలేసుకోవాలి. ముగ్గురు బ్రహ్మచారులకి విడివిడిగా యిచ్చేందుకు కట్టిన రూమ్స్ అయి వుంటాయి బహుశా అవి.

నడవాలో వున్న మెట్లెక్కి పైకి వెళ్తే మెయిన్ రోడ్ కనిపించేది. ఆ మేడెక్కి ప్రొద్దున పూట విపరీతమైన ట్రాఫిక్‌తో వున్నపుడూ, మళ్ళీ రాత్రిపూట నిర్మానుష్యంగా అయిపోయినపుడూ ఆ మెయిన్ రోడ్‌ని చూడటం చాలా బాగుండేది.

మనసంతా ఒకరకమైన ఆనందం నిండగా ఆ జ్ఞాపకాలన్నీ నెమరేసుకుంటూ వచ్చి సోఫాలో కూర్చున్నాను.

వంశీ, సుధ ఏదో మాట్లాడుతున్నారు.

రమ కూడా వచ్చింది పిల్లల్ని డాన్స్ క్లాస్ నుంచి పికప్ చేసుకుని. ఓ ప్రక్క వంట చేస్తూ మరో ప్రక్క కబుర్లు చెప్తోంది.

వాళ్ళ మాటలు ఓ వైపు నుంచి చెవిన పడుతున్నా... మరోవైపు నా మనసు యిందాక పైకి లేచిన చిన్నప్పటి జ్ఞాపకాల చుట్టూ పరిభ్రమిస్తోంది. మూర్తి అన్నట్లు ఆ జ్ఞాపకాల మాధుర్యం యిస్తున్న ఆనందం వల్ల అనుకుంటా.

చిన్నమామయ్య ఇల్లు ఇలా వుంటే రెండో మామయ్య యిల్లు మరో రకం. ఓ పెద్ద ఆవరణలో పర్ణశాల లాంటి యిల్లు. చాలా బాగుండేది. పెద్ద మామయ్య వాళ్ళేమో రైల్వే క్వార్టర్స్‌లో వుండేవాళ్ళు. రైలు పట్టాల ప్రక్కనే యిల్లు. వాకిట్లో బంతిపూలు. ఇంటి మీదకి ప్రాకిన గుమ్మడి పాదు.

ఒక్కొక్కచోట ఒక్కొక్కరకంగా బాగుండేది.

ఇప్పుడు అందరూ హైదరాబాద్‌లోనే వున్నారు. సొంత ఇళ్ళు కట్టుకుని సెటిల్ అయ్యారు. కొందరివి యిండిపెండెంట్ హౌస్‌లు. కొందరివి అపార్ట్‌మెంట్స్. కానీ అన్నీ దాదాపుగా ఒకేరకం ప్లాన్‌తో వుండే టుబిహెచ్‌కెలు.

ఆర్థికంగా అన్నదమ్ముల మధ్య అపుడెలాంటి వ్యత్యాసాలున్నాయో యిపుడూ అవే వున్నాయి. కానీ పైకి కనిపించేంత వరకూ, రోజు వారీ జీవితానికి సంబంధించినంతవరకూ అందరివీ చిన్న తేడా కూడా లేని జీవితాలు.

మళ్ళీ నా అసంతృప్తికి కారణం దాదాపుగా దొరికిన భావన కలిగింది. కానీ పూర్తి క్లారిటీ రావడం లేదు.

మూర్తి చెప్పినట్లు పాత జ్ఞాపకాలు నన్ను బాధిస్తున్నాయా! అయితే యిందులో బాధ కలగాల్సిందేముంది? అపుడు వున్నదేమిటి! ఇపుడు కోల్పోయిందేమిటి?

రమ అన్నం వడ్డించి పిలవగానే ఆ ఆలోచనలతో పాటు వెళ్ళి టేబుల్ దగ్గర కూర్చున్నాను. భోజనం చేస్తుండగా చెప్పాడు వంశీ – కేరళ టూర్ వెళ్ళాలనుకుంటున్నామని.

"కొచ్చిన్ నుంచి ప్యాకేజ్ వుందట. కొచ్చిన్ వరకూ మనం వెళ్తే యిక అక్కడ నుంచి వాళ్ళే తిప్పుతారు" అన్నాడు.

"ప్యాకేజ్ ఎందుకు? మీరు మామూలుగా వెళ్తే యింకా బాగుంటుంది" అంది రమ.

"ప్యాకేజ్ అయితే కన్వీనియంట్‌గా వుంటుంది కదా! అన్నీ వాళ్ళే చూసుకుంటారు" అన్నాడు వంశీ.

"కన్వీనియంట్‌గా వుంటుంది. సంతృప్తిగా వుండదు" అంది రమ.

ఆ స్టేట్‌మెంట్ అర్థంకాని వాడిలా మొహం పెట్టాడు వంశీ. "అదేంటి రమా! మీకన్నీ ప్లాన్ ప్రకారం జరగాలి కదా! ప్యాకేజ్ ప్రిఫర్ చేయరా!" అన్నాడు.

సుధ నవ్వాడు. "సరేలే. ప్లాన్ ఎందుకుండదు! బోల్డు ప్లానింగ్ చేస్తుంది రమ టూర్ అంటే. ఇంటర్నెట్‌లో చూసి, ట్రావెలాగ్స్ చదివి, ప్యాకేజ్ టూర్ వాళ్ళ ప్రోగ్రామ్ కూడా పరిశీలించి అందరి బెస్ట్ ప్రాక్టీసెస్ తీసుకుని తన ప్రోగ్రాం తయారుచేస్తుంది."

సుధ చాలా క్యాజువల్‌గా చెప్పిన ఆ మాటల్లో మళ్ళీ ఏదో క్లూ దొరికినట్లయింది. కానీ పట్టుకోలేక పోతున్నాను. సరిగ్గా గుర్తు పట్టలేక పోతున్నాను.

"ప్యాకేజ్‌లోలాగా సరిగ్గా వారం అంటే వారంలో కాదనుకో మా టూర్......ఒక రోజో, రెండు రోజులో ఎక్కువవుతుంది. కానీ మేం చూడాలనుకున్నవన్నీ మాక్కావలసినట్లుగా చూశామన్న సంతృప్తి వుంటుంది".

సుధ మాటలు వింటూ భోజనం ముగించి వంశీ, నేనూ బయల్దేరాం. కారులో కూర్చుంటూ అన్నాడు వంశీ. "రమ చెప్పింది నిజమేలే. ప్యాకేజ్ టూర్‌లో వెళ్తే మన రాష్ట్రంలో శ్రీశైలానికీ, మహారాష్ట్రలో షిర్డీకి కూడా తేడా తెలీలేదు నాకు. రెండు ట్రిప్‌లూ ఒకేలా గడిచాయి".

వంశీ అన్న తీరుకి మేము ముగ్గురం నవ్వుతూ చూశాం.

"కాకపోతే నేను వారం రోజులకి బదులు పది రోజులు సెలవడిగితే మా ఆఫీసులో వాళ్ళు నవ్వుతారు. రీయిన్వెంటింగ్ ద వీల్ అని".

ఆ మాటలనేసి వంశీ సెలవు తీసుకున్నాడు. ఆ వెంటనే నేనూ బయల్దేరాను.

ఒక్కడ్నీ కారు నడుపుకుంటూ యింటికి వస్తుంటే....

నా ప్రశ్నలూ, ఆలోచనలూ మళ్ళీ నన్ను చుట్టుముట్టాయి. దానితోపాటు మూర్తి, వంశీ, సుధా, రమా.... అందరి గొంతులూ... ఈరోజు వాళ్ళు చేసిన వ్యాఖ్యలూ వినిపించ సాగాయి.

అసంతృప్తి..... అసౌకర్యం.... అభద్రత... నోస్టాల్జియా..... యూనిఫామ్...... మన టేస్ట్..... మన సౌకర్యం.... అన్నీ టుబిహెచ్‌కెలే.... శ్రీశైలమూ, షిర్డీ ఒకేలా తోచాయి... మావాళ్ళు రీయిన్వెంటింగ్ ద వీల్ అంటారు.

ఉలికిపాటుతో కారు ఆపాను. తాళం తీసుకుని యింట్లోకి వస్తూంటే... హఠాత్తుగా నాకర్థమయింది..... నాకర్థమయింది. సమస్య యూనిఫార్మిటీ. అందర్నీ ఒకే మూసలోకి లాగేస్తున్న యూనిఫార్మిటీ.

అవును. ఇప్పుడు వైరుధ్యాలు వుండేందుకు అవకాశమే లేదు.

పాతికేళ్ళొచ్చినా ఉద్యోగం సంపాదించుకోలేకపోవడం చేతకానితనం. ఉద్యోగం వచ్చినా కూడా పెళ్ళి చేసుకునీ, ఇల్లు కట్టుకునీ సెటిలవ్వకపోతే మూర్ఖత్వం.

నెలకి కనీసం నలభై వేలు సంపాదించ లేకపోతే అప్రయోజకత్వం. నలభై వేలు సంపాదిస్తూ కూడా నడిచి ఆఫీసుకెళ్తే మూర్ఖత్వం.

ఒక్క బిడ్డయినా లేకపోతే దౌర్భాగ్యం. ఇద్దరికన్నా ఎక్కువ వుంటే మూర్ఖత్వం.

ఇంగ్లీషు ధారాళంగా రాకపోవడం అపహాస్యం చేయాల్సిన విషయం. ఇంగ్లీషు చక్కగా వచ్చి కూడా తెలుగు పుస్తకాలే చదువుకోవడం హాస్యాస్పదం.

వీకెండ్‌ని ఎన్ని రకాలుగా ఎంజాయ్ చేయాలో తెలియక పోవడం విచారకరం. తెలిసి కూడా యిల్లే వైకుంఠంగా కూర్చోవడం అజ్ఞానం.

మనిషి అన్న ప్రతివాడు... అప్రయోజకుడన్న అవహేళననీ, మూర్ఖుడన్న అపహాస్యాన్నీ అవాయిడ్ చేయాలంటే ... ఖచ్చితంగా ఆ రెండు హద్దుల మధ్యే బ్రతకాలి.

పాతికేళ్ళొచ్చేసరికి ఉద్యోగం సంపాదించి, పెళ్ళిచేసుకుని, ఇద్దరు మాత్రమే పిల్లల్ని కని.... ఒక ఇల్లు కట్టుకుని, ఒక కారు కొనుక్కుని....

అంతే! పెద్ద విషయాలనుంచి చిన్న విషయాల దాకా ఎక్కడా ఒక అంగుళం ప్రక్కకి జరిగే అవకాశం లేదు. లెఫ్ట్‌కి జరిగితే చేతకానితనం, రైట్‌కి వెళ్తే మూర్ఖత్వం.... ఇదే అసంతృప్తికి మూల కారణం.

ఈ బలవంతపు సమానత్వమే తాను భరించలేకపోతున్న విషయం.

ఎందుకంటే ఈ సమానత్వం ఉన్నదేదో అందరం సమానంగా పంచుకు తినడం కాదు. ఈ సమానత్వం వేరు. ఇది అందరం ఒకే గమ్యం వైపు సమానంగా పరుగెత్తడం... ఒకే రకంగా అలుపు తీర్చుకోవడం.... ఒకేరకంగా క్రింద పడడం.... ఒకే రకమైన మందు వేసుకోవడం.... మళ్ళీ లేచి ఒకే రకంగా పరుగెత్తడం.

దీనిలోనూ కొంత మంచి వుంటే వుండచ్చు. ఒకళ్ళని చూసి ఒకళ్ళు నేర్చుకోవడం ఒక గొప్ప విషయమే. అయితే ఆ గొప్ప విషయం ఆనందం కలిగించేలోపు అసలు యిది... ఈ పరుగెత్తడం నేర్చుకోవాల్సిన విషయమేనా అన్న అనుమానం.

దెబ్బ తగిలినపుడు అవతలి వాడు ఏ మందు రాసుకుంటున్నాడో నాకు వెంటనే తెలియడం.... ఆ మందు నాకూ అందుబాటులో వుండడం గొప్ప రిలీఫే. కానీ దాన్ని వెన్నంటే అసలు ఈ గుంపుతో పరుగెత్తడం మొదలుపెట్టి వుండకపోతే ఈ పడే గోల... మందు రాసుకునే గోల వుండేది కాదు గదా అన్న మీమాంస.

అవును! అసంతృప్తికి మూలకారణం అసమానత కాదు. సమానత. ఏ చిన్న వైరుధ్యమూ లేకుండా ఎటు చూసినా ఒకేలా ఉన్న సమానత.

మూర్తి చెప్పినట్లు ఏ పల్లెటూరికో వెళ్తే కలుగుతున్న బాధకి కారణం చిన్నప్పటి మధుర జ్ఞాపకాలు కావు. అక్కడా దాదాపుగా యిదే సమానత కనిపించడం. అక్కడికి వెళ్ళినా పెద్ద మార్పేమీ వుండదన్న విషయం అర్థం కావడం. ఊపిరి ఆడని దారిలో ముందుకు సాగుతూ మరీ తట్టుకోలేని పరిస్థితే వస్తే వెనక్కి వెళ్ళచ్చులే అనే ధైర్యంతో వున్నవాడికి వెనకా అదే పరిస్థితి ఏర్పడుతోందనీ వెనక్కి వెళ్ళినా వూపిరాడదనీ తెలిసినపుడు కలిగే భయం.

హమ్మయ్య! కారణం కొంచెం తెలిసింది. నా అసంతృప్తికి కారణం తెలిసింది. నా సమస్యకి మూలం దొరికింది. ఇక సాల్వ్ చేసుకోవడమే మిగిలింది. ఏ సమస్యకైనా కారణం తెలిస్తే దాన్ని నివారించే వుపాయం కనుక్కోవడం చాలా సులువని నాకు యిప్పటివరకూ గొప్ప నమ్మకం.

కానీ యిపుడది కొంచెం సడలుతోంది. ఈ సమస్యని సాధించడం అంత సులభం కాకపోవచ్చు. కానీ కష్టమా! కష్టమూ కాదేమో! సుధ లాంటి వాళ్ళ జీవితాన్ని కొంచెం జాగ్రత్తగా గమనిస్తే ఆ విద్య నేర్చుకోవడం కష్టం కాకపోవచ్చు.

చూద్దాం! దాని గురించి ఆలోచించడం రేపట్నుంచీ మొదలు పెడదాం. ఇపుడే మొదలు పెట్టి కారణం తెలుసుకున్న ఆనందాన్ని కూడా దూరం చేసుకోవడమెందుకు? ఇప్పటికి ఈ ఆలోచనలని యిక్కడితో ఆపేద్దాం.

సంతృప్తిగా నిట్టూరుస్తూ దిండు మీద తలవాల్చి నిద్రకుపక్రమించాను.

- రచన మాసపత్రిక

జనవరి 2010

(కథాపీఠం పురస్కారం పొందిన కథ)